14-10-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఆజ్ఞాకారులుగా అవ్వండి, తండ్రి యొక్క మొదటి ఆజ్ఞ ఏమిటంటే - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి"

ప్రశ్న:- ఆత్మ రూపీ పాత్ర అశుద్ధముగా ఎందుకు అయ్యింది? దానిని శుద్ధముగా తయారుచేయడానికి సాధనము ఏమిటి?

జవాబు:- వ్యర్థమైన విషయాలను వింటూ, వినిపిస్తూ ఆత్మ రూపీ పాత్ర అశుద్ధముగా అయిపోయింది. దానిని శుద్ధముగా తయారుచేసేందుకు తండ్రి ఆజ్ఞ - చెడును వినకండి, చెడును చూడకండి... అని ఇచ్చారు. ఒక్క తండ్రి నుండే వినండి మరియు తండ్రినే చూడండి, అప్పుడు ఆత్మ రూపీ పాత్ర శుద్ధముగా అవుతుంది. ఆత్మ మరియు శరీరము రెండూ పావనముగా అయిపోతాయి.

పాట:- ఎవరైతే తండ్రితో ఉంటారో... (జో పియా కే సాథ్ హై...)

ఓం శాంతి. ఓం శాంతి అర్థమును పిల్లలు అర్థం చేసుకున్నారు. ఎలాగైతే ఘడియ-ఘడియ తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయండి అని చెప్పడం జరుగుతుందో, అలాగే పిల్లలకు ఘడియ-ఘడియ పాయింట్లను ఇవ్వడం జరుగుతుంది. ఇక్కడ మనుష్యులు ఎవరినీ స్మృతి చేయడం అనేది ఉండదు. మనుష్యులు, మనుష్యుల స్మృతిని లేక ఎవరైనా దేవతల స్మృతిని ఇప్పిస్తారు. పారలౌకిక తండ్రి యొక్క స్మృతిని ఎవరూ ఇప్పించలేరు ఎందుకంటే తండ్రి గురించి ఎవరికీ తెలియదు. ఇక్కడ మీకు - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి అని ఘడియ-ఘడియ చెప్పడం జరుగుతుంది. ఎలాగైతే తండ్రికి కొడుకు జన్మిస్తే, ఇతడు తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకునేందుకు వచ్చాడని అందరూ అర్థం చేసుకోగలరు. అప్పుడు అతనికి తండ్రి మరియు వారసత్వము గుర్తుంటాయి. ఇక్కడ కూడా అంతే. తప్పకుండా పిల్లలకు తండ్రి గురించి తెలియదు, అందుకే తండ్రి రావలసి ఉంటుంది. ఎవరైతే తండ్రితో పాటు ఉంటారో వారి కొరకు ఈ జ్ఞాన వర్షం కురుస్తుంది. వేద-శాస్త్రాలలో ఏదైతే జ్ఞానం ఉందో అదంతా భక్తి మార్గపు సామాగ్రి. జప, తప, దాన, పుణ్యాదులు, సంధ్యా ప్రార్థన, గాయత్రి మొదలైనవేవైతే చేస్తారో అవన్నీ భక్తి మార్గపు సామాగ్రి. సన్యాసులు కూడా భక్తులే. పవిత్రత లేకుండా ఎవరూ శాంతిధామంలోకి వెళ్ళలేరు కావుననే వారు ఇళ్ళూ-వాకిళ్ళను వదిలి వెళ్ళిపోతారు. కానీ మొత్తం ప్రపంచమంతా ఈ విధంగా చేయదు. వారి యొక్క ఈ హఠయోగము కూడా డ్రామాలో నిశ్చితమై ఉంది. పిల్లలైన మీకు రాజయోగాన్ని నేర్పించేందుకు కల్ప-కల్పమూ ఒక్కసారే వస్తాను. నాకు వేరే అవతారమేమీ ఉండదు. రీ-ఇన్కార్నేషన్ ఆఫ్ గాడ్ (భగవంతుని పునఃఅవతరణ) అని అంటారు. వారు ఉన్నతోన్నతమైనవారు. మరి జగదాంబ మరియు జగత్పితల పునఃఅవతరణ కూడా తప్పకుండా జరగాలి. వాస్తవానికి రీ-ఇన్కార్నేషన్ (పునఃఅవతరణ) అన్న పదము కేవలం తండ్రికే వర్తిస్తుంది. సద్గతిదాత ఒక్క తండ్రియే. ఆ మాటకొస్తే ప్రతీది మళ్ళీ పునరావృతమవుతుంది. ఏ విధంగానైతే ఇప్పుడు భ్రష్టాచారము ఉంది, కావున భ్రష్టాచారము పునరావృతం అయ్యింది అని అంటారు. మళ్ళీ భ్రష్టాచారము జరిగింది, మళ్ళీ శ్రేష్ఠాచారము వస్తుంది. ప్రతీది మళ్ళీ పునరావృతమవుతుంది. ఇప్పుడు పాత ప్రపంచము ఉంది, మళ్ళీ కొత్త ప్రపంచము వస్తుంది. కొత్త ప్రపంచం తర్వాత మళ్ళీ పాత ప్రపంచము రానున్నది అని అంటారు. ఈ విషయాలన్నీ తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. ఇక్కడ కూర్చున్నప్పుడు - నేను ఆత్మను, నన్ను స్మృతి చేయండి అని నాకు తండ్రి ఆజ్ఞ లభించింది అని సదా భావించండి. పిల్లలకు తప్ప ఇంకెవరికీ తండ్రి ఆజ్ఞ లభించదు. పిల్లలలో కొందరు ఆజ్ఞాకారులుగా ఉంటారు, మరికొందరు ఆజ్ఞను పాటించనివారిగా కూడా ఉంటారు. తండ్రి అంటారు - ఓ ఆత్మల్లారా, మీరు నాతో బుద్ధియోగాన్ని జోడించండి. తండ్రి ఆత్మలతో మాట్లాడుతారు, ఇంకే ఇతర విద్వాంసులు, పండితులు మొదలైనవారు - నేను ఆత్మలతో మాట్లాడుతాను అని ఈ విధంగా అనరు. వారైతే ఆత్మనే పరమాత్మ అని భావిస్తారు. అది పొరపాటు. శివబాబా ఈ శరీరము ద్వారా మనకు అర్థం చేయిస్తున్నారని పిల్లలైన మీకు తెలుసు. శరీరము లేకుండా కర్మ జరగదు. మొట్టమొదటగా ఈ నిశ్చయం ఉండాలి. నిశ్చయం లేకుండా బుద్ధిలో అసలేమీ కూర్చోదు. మొదట నిశ్చయము ఉండాలి - ఆత్మలమైన మనకు తండ్రి ఆ నిరాకార పరమపిత పరమాత్మ మరియు సాకారములో ప్రజాపిత బ్రహ్మ ఉన్నారు, మనమేమో బ్రహ్మకుమారులము-కుమారీలము. శివునికైతే ఆత్మలందరూ పిల్లలే కావుననే శివకుమారులు అని అంటారు కానీ శివకుమారీలు అని అనరు. ఈ విషయాలన్నింటినీ ధారణ చేయాలి. ఎప్పుడైతే నిరంతరం స్మృతి చేస్తూ ఉంటారో, అప్పుడే ధారణ జరుగుతుంది. స్మృతి చేయడం ద్వారానే బుద్ధి రూపీ పాత్ర శుద్ధమవుతుంది. వ్యర్థమైన

విషయాలను వింటూ-వింటూ పాత్ర అశుద్ధముగా అయిపోయింది, దానిని శుద్ధముగా తయారుచేయాలి. తండ్రి ఆజ్ఞ ఏమిటంటే - నన్ను స్మృతి చేసినట్లయితే మీ బుద్ధి పవిత్రముగా అవుతుంది. మీ ఆత్మలో మాలిన్యం చేరుకుంది, ఇప్పుడు పవిత్రంగా అవ్వాలి. ఆత్మ నిర్లేపి అని సన్యాసులు అంటారు. తండ్రి అంటారు - ఆత్మలోనే మాలిన్యం చేరుకుంది. శ్రీకృష్ణుని ఆత్మ మరియు శరీరము రెండూ పవిత్రంగా ఉంటాయి. రెండూ పవిత్రముగా కేవలం సత్యయుగములోనే ఉంటాయి. ఇక్కడైతే అలా ఉండవు. ఆత్మలైన మీరు నంబరువారుగా పవిత్రంగా అవుతూ ఉన్నారు. ఇప్పుడింకా పవిత్రంగా అవ్వలేదు. ఎవ్వరూ పవిత్రంగా లేరు. అందరూ పురుషార్థము చేస్తున్నారు. అంతిమంలో నంబరువారుగా అందరి రిజల్టు వెలువడుతుంది.

తండ్రి వచ్చి ఆత్మలందరికీ ఆజ్ఞను ఇస్తారు - నన్ను స్మృతి చేయండి, స్వయాన్ని అశరీరిగా భావించండి, దేహీ-అభిమానులుగా అవ్వండి. ఈ ముఖ్యమైన విషయాన్ని తండ్రి తప్ప ఇంకెవ్వరూ అర్థం చేయించలేరు. మొదట ఈ పూర్తి నిశ్చయము ఉన్నట్లయితే విజయాన్ని పొందుతారు, నిశ్చయం లేకపోతే విజయాన్ని పొందలేరు. నిశ్చయబుద్ధి విజయంతి, సంశయబుద్ధి వినశ్యంతి. గీతలో కొన్ని పదాలు చాలా బాగున్నాయి. దానిని పిండిలో ఉప్పంత అని అంటారు. తండ్రి అంటారు - అన్ని వేద-శాస్త్రాలలో ఏమున్నాయో, వాటి సారాన్ని నేను మీకు అర్థం చేయిస్తాను. ఇవన్నీ భక్తి మార్గపు దారులు. ఇవి కూడా డ్రామాలో నిశ్చితమై ఉన్నాయి. ఈ భక్తి మార్గం ఎందుకు తయారుచేయబడి ఉంది అన్న ప్రశ్న ఉత్పన్నమవ్వకూడదు. ఇదైతే అనాదిగా తయారై తయారుచేయబడిన డ్రామా. మీరు కూడా ఈ డ్రామాలో తండ్రి నుండి స్వర్గానికి యజమానులుగా అయ్యే వారసత్వాన్ని అనేక సార్లు తీసుకున్నారు మరియు తీసుకుంటూ ఉంటారు. ఇది ఎప్పటికీ అంతమవ్వదు. ఈ చక్రము అనాదిగా తిరుగుతూనే ఉంటుంది. పిల్లలైన మీరిప్పుడు దుఃఖధామములో ఉన్నారు, తర్వాత శాంతిధామములోకి వెళ్తారు, ఆ తర్వాత శాంతిధామం నుండి సుఖధామంలోకి వెళ్తారు, మళ్ళీ దుఃఖధామములోకి వస్తారు - ఈ అనాది చక్రము తిరుగుతూనే ఉంటుంది. సుఖధామం నుండి దుఃఖధామములోకి రావడానికి పిల్లలైన మీకు 5000 సంవత్సరాలు పడుతుంది. ఇందులో మీరు 84 జన్మలు తీసుకుంటారు. కేవలం పిల్లలైన మీరు మాత్రమే 84 జన్మలు తీసుకుంటారు, అందరూ తీసుకోలేరు. ఈ అనంతమైన తండ్రి మీకు డైరెక్టుగా అర్థం చేయిస్తారు, మిగిలిన పిల్లలు మురళిని వింటారు లేక చదువుతారు లేక టేప్ ద్వారా వింటారు. టేప్ ద్వారా కూడా అందరూ వినలేరు. కావున మొట్టమొదట పిల్లలైన మీరు లేస్తూ-కూర్చుంటూ ఈ స్మృతిలో ఉండాలి. మనుష్యులైతే మాలను తిప్పుతూ రామ-రామ అని జపిస్తారు. రుద్రాక్ష మాల అని అంటారు కదా. ఇప్పుడు రుద్రుడు అనగా భగవంతుడు. మళ్ళీ ఈ మాలలో మేరువు (జంట పూసలు) కలిసి ఉంటాయి. అది విష్ణువు యొక్క యుగళ్ స్వరూపము. వారు ఎవరు? ఈ మాత-పిత, వారే మళ్ళీ విష్ణువు యొక్క రెండు రూపాలైన లక్ష్మీ-నారాయణులుగా అవుతారు, కావుననే వారిని మేరువు అని అంటారు. శివబాబా పుష్పము, ఆ తర్వాత మేరువు (జంటపూసలు) ఈ మమ్మా-బాబా, వారినే మాత-పిత అని అంటారు. విష్ణువును మాత-పిత అని అనలేరు. లక్ష్మీ-నారాయణులను మాత-పిత అని వారి పిల్లలే అంటారు. ఈ రోజుల్లోనైతే అందరి ముందుకూ వెళ్ళి త్వమేవ మాతాశ్చ పితా (నీవే తల్లివి, తండ్రివి)... అని అంటారు, ఇలా ఎవరైనా ఒకరు మహిమ చేస్తే వారిని అందరూ అనుసరించడం మొదలుపెడతారు. ఇది ఉన్నదే అధర్మయుక్తమైన ప్రపంచము. కలియుగాన్ని అధర్మయుక్తమైనదని, సత్యయుగాన్ని ధర్మయుక్తమైనదని అనడం జరుగుతుంది. అక్కడ ఆత్మ మరియు శరీరము రెండూ పవిత్రంగా ఉంటాయి. సత్యయుగంలో శ్రీకృష్ణుడు తెల్లగా ఉంటాడు, మళ్ళీ అంతిమ జన్మలో అతని ఆత్మ నల్లగా అయ్యింది. ఈ బ్రహ్మా-సరస్వతులు ఈ సమయంలో నల్లగా ఉన్నారు కదా. ఆత్మ నల్లగా అయిపోయింది కావున దాని నగ కూడా నల్లగా అయిపోయింది. బంగారంలోనే మాలిన్యం చేరుకుంటుంది, దాని నుండి ఏ నగ అయితే తయారవుతుందో, అది కూడా మాలిన్యం కలదిగా ఉంటుంది. సత్యయుగములో దేవీ-దేవతల ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ అసత్యము (మాలిన్యం) ఉండదు. అక్కడైతే బంగారు మహళ్ళను నిర్మిస్తారు. భారత్ బంగారు పిచ్చుకగా ఉండేది, ఇప్పుడు మాలిన్యం చేరుకుంది. ఇటువంటి భారత్ ను మళ్ళీ స్వర్గముగా తండ్రే తయారుచేయగలరు.

తండ్రి అర్థం చేయిస్తారు - శ్రీమత్ భగవానువాచ ఉంది కదా. శ్రీకృష్ణుడైతే దైవీ గుణాలు కలవారు, రెండు భుజాలు, రెండు కాళ్ళు కలవారు. చిత్రాలలో కొన్నిచోట్ల నారాయణునికి, కొన్నిచోట్ల లక్ష్మీకి నాలుగు భుజాలను చూపించారు. ఏమీ అర్థం చేసుకోరు. ఓం అని కూడా అంటారు, ఓం అన్న పదము యొక్క అర్థాన్ని చెప్తారు - ఓం అనగా నేను భగవంతుడిని, ఎక్కడ చూసినా భగవంతుడే భగవంతుడు అని అంటారు. కానీ ఇది తప్పు. ఓం అనగా నేను ఆత్మను. తండ్రి కూడా - నేను ఆత్మను కానీ నేను ఉన్నతోన్నతమైనవాడను, అందుకే నన్ను పరమాత్మ అని అంటారు . నేను పరంధామంలో ఉంటాను అని చెప్తారు. ఉన్నతోన్నతమైనవారు భగవంతుడు, ఆ తర్వాత సూక్ష్మవతనములో బ్రహ్మా,

విష్ణు, శంకరుల ఆత్మలు ఉంటాయి. మళ్ళీ కిందకు వచ్చినట్లయితే ఈ మనుష్య లోకము ఉంది. అదేమో దైవీ లోకము, అది ఆత్మల లోకము, దానిని మూలవతనము అని కూడా అంటారు. ఈ విషయాలు అర్థం చేసుకోవలసినవి. పిల్లలైన మీకు ఈ అవినాశీ జ్ఞానరత్నాల దానము లభిస్తుంది, వీటి ద్వారా మీరు భవిష్యత్తులో ధనవంతులుగా, ద్వికిరీటధారులుగా అవుతారు. చూడండి - శ్రీకృష్ణునికి రెండు కిరీటాలు ఉన్నాయి కదా. మళ్ళీ ఆ బాలుడే చంద్రవంశములోకి వచ్చినప్పుడు రెండు కళలు తగ్గిపోతాయి. మళ్ళీ వైశ్యవంశములోకి వచ్చినట్లయితే ఇంకా 4 కళలు తగ్గిపోతాయి. అప్పుడు ప్రకాశ కిరీటము మాయమైపోతుంది. రత్నజడితమైన కిరీటము ఉంటుంది. ఇంకా ఎవరైతే చాలా బాగా దాన-పుణ్యాలను చేస్తారో, వారికి ఒక్క జన్మ కొరకు మంచి రాజ్యం లభిస్తుంది. మళ్ళీ మరుసటి జన్మలో కూడా బాగా దాన-పుణ్యాలు చేసినట్లయితే మళ్ళీ రాజ్యం లభించవచ్చు. ఇక్కడ మీరు 21 జన్మల కొరకు రాజ్యాన్ని పొందగలుగుతారు, శ్రమించవలసి ఉంటుంది. కావున తండ్రి తమ పరిచయాన్ని ఇస్తారు - ఐ ఆమ్ సుప్రీమ్ సోల్ (నేను పరమ ఆత్మను), అందుకే వారిని పరమపిత పరమ ఆత్మ అనగా పరమాత్మ అని అంటారు. పిల్లలైన మీరు ఆ ఉన్నతోన్నతమైనవారిని తలచుకుంటారు. మీరు సాలిగ్రామాలు, వారు శివుడు. శివుని యొక్క పెద్ద లింగాన్ని మరియు సాలిగ్రామాలను మట్టితో తయారుచేస్తారు. ఇలా ఏ ఆత్మల స్మృతిచిహ్నాన్ని తయారుచేస్తారు అనేది కూడా ఎవరికీ తెలియదు. శివబాబా పిల్లలైన మీరు భారత్ ను స్వర్గముగా తయారుచేస్తారు కావుననే మీకు పూజ జరుగుతుంది. తర్వాత మీరు దేవతలుగా అయినప్పుడు కూడా మీకు పూజ జరుగుతుంది. శివబాబాతోపాటు మీరు ఇంతటి సేవ చేస్తారు కావున సాలిగ్రామాలకు కూడా పూజ జరుగుతుంది. ఎవరైతే ఉన్నతోన్నతమైన కర్తవ్యమును చేస్తారో, వారికి పూజ జరుగుతుంది మరియు కలియుగములో ఎవరైతే మంచి పనులు చేస్తారో వారి స్మృతిచిహ్నాన్ని తయారుచేస్తారు. కల్ప-కల్పము తండ్రి పిల్లలైన మీకు మొత్తం సృష్టి చక్రం యొక్క రహస్యాన్ని అర్థం చేయిస్తారు అనగా మిమ్మల్ని స్వదర్శన చక్రధారులుగా తయారుచేస్తారు. స్వదర్శన చక్రము విష్ణువుకు ఉండదు, వారైతే దేవతగా అయిపోయారు. ఈ జ్ఞానమంతా మీకు ఉంటుంది. మళ్ళీ లక్ష్మీ-నారాయణులుగా అయితే, ఇక ఈ జ్ఞానం ఉండదు. అక్కడైతే అందరూ సద్గతిలో ఉంటారు. పిల్లలైన మీరు ఈ జ్ఞానాన్ని ఇప్పుడే వింటారు, తర్వాత రాజ్యాన్ని పొందుతారు. స్వర్గ స్థాపన జరిగిన తర్వాత ఇక జ్ఞానం యొక్క అవసరము ఉండదు.

తండ్రే వచ్చి తమ పూర్తి పరిచయాన్ని మరియు రచన యొక్క పూర్తి పరిచయాన్ని ఇస్తారు. సన్యాసులు మాతలను నిందించారు, కానీ తండ్రి వచ్చి మాతలను ఉన్నతంలోకి తీసుకువెళ్ళారు. తండ్రి ఇది కూడా అర్థం చేయిస్తారు - ఈ సన్యాసులు లేకపోయినట్లయితే భారత్ కామచితిపై కూర్చొని పూర్తిగా బూడిదైపోయేది. ఎప్పుడైతే దేవీ-దేవతలు వామ మార్గంలో పడిపోతారో, ఆ సమయంలో భూకంపాలు చాలా తీవ్రంగా వస్తాయి, అప్పుడు అంతా కిందకు వెళ్ళిపోతుంది. ఇతర ఖండాలేవీ ఉండవు, భారత్ మాత్రమే ఉంటుంది. ఇస్లామీయులు మొదలైనవారు తర్వాత వస్తారు, అప్పుడు ఆ సత్యయుగపు వస్తువులేవీ ఇక్కడ ఉండవు. మీరు ఏ సోమనాథ మందిరాన్ని అయితే చూస్తారో, అది వైకుంఠంలోనిది కాదు. అది భక్తి మార్గంలో తయారుచేయబడినది, దానిని ముహమ్మద్ గజనీ మొదలైనవారు దోచుకున్నారు. ఇక దేవతల మహళ్ళు మొదలైనవన్నీ భూకంపాలలో మాయమైపోతాయి. మహళ్ళకు మహళ్ళు కిందకు వెళ్ళి, మళ్ళీ అవే పైకి వస్తాయని కాదు. అలా కాదు, అవైతే లోపలే విచ్ఛిన్నమైపోతాయి. ఆ సమయంలో తవ్వినట్లయితే ఏదోకటి లభిస్తుంది. ఇప్పుడైతే ఏమీ లభించదు. శాస్త్రాలలో ఈ విషయాలేవీ లేవు. సద్గతిదాత ఒక్క తండ్రియే. మొట్టమొదట ఈ నిశ్చయం ఉండాలి. నిశ్చయంలోనే మాయ విఘ్నాలను కలిగిస్తుంది. భగవంతుడు ఎలా వస్తారు అని అంటారు. అరే, శివజయంతి ఉందంటే, తప్పకుండా వారు వచ్చి ఉంటారు. తండ్రి అర్థం చేయించారు - నేను అనంతమైన పగలు మరియు అనంతమైన రాత్రి యొక్క సంగమములో వస్తాను. ఏ సమయంలో వస్తాను అనేది ఎవరికీ తెలియదు. పిల్లలైన మీకు తెలుసు. తండ్రే ఈ జ్ఞానాన్ని ఇచ్చారు మరియు దివ్యదృష్టి ద్వారా ఈ చిత్రాలు మొదలైనవాటిని తయారుచేయించారు. గీతలో కూడా కల్పవృక్షము గురించి కొంత వర్ణన ఉంది. తండ్రి పిల్లలతో అంటారు - మీరు-నేను ఇప్పుడు ఉన్నాము, కల్పక్రితం కూడా ఉన్నాము, మళ్ళీ కల్ప-కల్పమూ కలుస్తూ ఉంటాము. నేను కల్పకల్పమూ మీకు ఈ జ్ఞానాన్ని ఇస్తాను. కావున చక్రము గురించి కూడా నిరూపించబడుతుంది. కానీ మీరు తప్ప ఇంకెవరూ అర్థం చేసుకోలేరు. ఇదంతా సృష్టి చక్రం యొక్క చిత్రము, వీటిని తప్పకుండా ఎవరో తయారుచేయించి ఉంటారు. తండ్రి కూడా దీనిపై అర్థం చేయిస్తారు, పిల్లలు కూడా దీనిపై అర్థం చేయిస్తారు. అచ్చా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ప్రతి విషయములోనూ విజయానికి ఆధారము నిశ్చయమే, అందుకే నిశ్చయబుద్ధి కలవారిగా తప్పకుండా అవ్వాలి. సద్గతిదాత అయిన తండ్రిపై ఎప్పుడూ సంశయం రానివ్వకూడదు.

2. బుద్ధిని పవిత్రముగా మరియు శుద్ధముగా తయారుచేసుకునేందుకు అశరీరిగా అయ్యే అభ్యాసము చేయాలి. వ్యర్థమైన విషయాలను వినకూడదు, వినిపించకూడదు.

వరదానము:- అనంతమైన స్మృతి స్వరూపము ద్వారా హద్దు విషయాలను సమాప్తము చేసే అనుభవీ మూర్త భవ

శ్రేష్ఠ ఆత్మలైన మీరు డైరెక్టు బీజము మరియు ముఖ్యమైన రెండు ఆకులు అయిన త్రిమూర్తులతోపాటు సమీప సంబంధములో ఉండే కాండము వంటివారు. ఇటువంటి ఉన్నతమైన స్థితిలోనే స్థితులవ్వండి, అనంతమైన స్మృతి స్వరూపులుగా అవ్వండి, అప్పుడు హద్దులోని వ్యర్థ విషయాలు సమాప్తమవుతాయి. మీ అనంతమైన వానప్రస్థములోకి వచ్చినట్లయితే సదా సర్వ అనుభవీ మూర్తులుగా అవుతారు. ఏదైతే అనంతమైన పూర్వజ స్థితి అనే కర్తవ్యము ఉందో దానిని సదా స్మృతిలో ఉంచుకోండి. పూర్వజులైన మీ పని ఏమిటంటే - అమరజ్యోతులుగా అయి అంధకారములో దారి తప్పి భ్రమిస్తున్న ఆత్మలను ఆశ్రయ స్థానానికి చేర్చటము.

స్లోగన్:- ఏ విషయములోనైనా తికమక చెందేందుకు బదులుగా ఆనందాన్ని అనుభవము చెయ్యటమే ఆనందములో నిమగ్నమై ఉండే యోగులుగా అవ్వటము.